



# కల తెచ్చిన రూపాయిలు

పి.శ్రీదేవి

బారెడు పొద్దెక్కింది. సరస్వతి వంటింట్లో పొయ్యి రాజేస్తూంది కాబోలు, ఇల్లంతా పొగ కమ్ముకుంది.

చిలక్కొయ్యనున్న చిరుగుల ధోవతిని తీసి వీలైనంతవరకూ చిరుగులు కనబడకుండా కట్టి, అంతకంటె ఎక్కువే చిరిగిన పాత గళ్ల లాల్చీ తొడిగి, దానిమీద తనలాగే మాసిపోయి, మురిగిపోయినా యింకా బ్రతికే ఉంటాననే ఆ తోపు రంగు కోటును తొడిగి, సగం చిరిగిన చెప్పులు తొడుగుకుని, వీధిలోకి బయల్దేరాడు పరంధామయ్య.

కోటు జేబులు రెండూ పొడుం డబ్బాకోసం వెతికాడు, కాని కనపడలేదు.

''సరస్వతీ! నా పొడుండబ్బా ఎక్కడైనా చూశావా'' అని కేకేశాడు.

సరస్వతి వంటింట్లోంచి అవతలకి వచ్చి ''ఇందులో పొడుమైపోయింది మామయ్యా! నిన్న రాత్రి భోజనం చేసినపుడు పీటదగ్గిరే వదిలేశావు'' అంటూ తెచ్చిచ్చింది.

''పొడుముంటే రాత్రినుంచి అది నీదగ్గిర ఎందు కుంటుందమ్మా! నాదగ్గరే ఉండును'' అన్నాడు.

డబ్బాలో పొడుం నిన్ననే ఐపోయింది. కాని ఏంచేస్తాడు. జేబులో కానీ లేదు. ఊరుకున్నాడు.

''ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. ఇతర దినుసులు కూడా ఐపోవచ్చాయి. కనీసం బియ్యమైనా తెచ్చి పడేస్తే ఎలాగో గడిపేయవచ్చును'' అన్నది ఆ దినం పొద్దుటే సరస్వతి భయపడుతూ-భయపడుతూ. అందుకే ఇప్పుడు బయలుదేరాడు పరంధామయ్య. ఎక్కడైనా అప్పుపెట్టో అరువడిగో ఆ బియ్యమైనా తీస్తేగాని లేకపోతే రాత్రికి పస్తుండాల్సిందే.

కోడలింత అన్నం ఉడకేసి పెడితే ఇన్ని మజ్జిగ నీళ్ళతోనైనా కడుపు కక్కుర్తి తీర్చుకుని పట్టెడు పొడుము పీల్చుకుని కూర్చోవచ్చు. అంతకన్న చేసేదేముందీ! ఏం చెయ్యగలడు.

కాని అప్పుపెడితే తీర్చేదెలాగ? అదే సమస్య. తాతలనాటి ఆస్తంతా ఏనాడో హరించిపోయింది. చేసే ఆ చిన్న ఉద్యోగంనుండి రిటైరై పదేళ్లు కావచ్చింది. ఆ వయస్సులో ఏం చేస్తాడు? ఉన్న ఆ ఒక్క కొడుకు ఉద్ధరిస్తాడనుకుంటే దేశాలంటపోయాడు. అటు కోడలి గొంతుక్కోశాడు - తనకా ఈ వృద్ధాప్యంలో సుఖమూ శాంతి అన్నది లేకుండా బ్రతుకును దుర్భరంగా తయారుచేసి పెట్టాడు.

ఏదో ఆలోచించుకుంటూ వీధి వసారా దాకా వెళ్లిన పరంధామయ్యను "మామయ్యా" అని వెనక్కు పిలిచింది సరస్వతి.

''ఏమమ్మా'' అని మళ్ళీ నడవలోకి అడుగేశాడు.

"నిన్న సాయంత్రం నువ్వు రామయ్యగారి ఇంటికి వెళ్లినప్పుడు ఉత్తర మొకటొచ్చింది" అన్నది.

కథానిక

''ఉత్తరమా! ఏదీ రాత్రివ్వలేదేమీ?'' అంటూ లోపలికి మరి నాలుగడుగులు వేశాడు.

"ఆయనే రాశారు మళ్ళీ...."

అర్ధోక్తిలోనే అర్థం చేసికున్నాడు పరంధామయ్య.

"వాడు మళ్ళీ రాశాడూ! ఏమని రాశాడు? సిగ్గులేక పోతేసరి. మానవ జన్మెత్తగానే సరా! ఏ ముఖం పెట్టుకుని రాశాడు. నీ గొంతు కోశాడు. నన్ను సర్వనాశనం చేశాడు ఇంకా ఏం చేద్దామనుకుంటున్నాడు...." పరంధామయ్య కోపంతో వరవళ్ళు త్రొక్కుతున్నాడు.

సరస్వతికి అతన్నిచూస్తే భయం వేస్తూంది. గ్రుడ్లనీరు కుక్కుకుంటూ తలుపు రెక్క నానుకుని దీనంగా నిల్చుంది.

"నువ్విలా కోపం తెచ్చుకుంటావనే భయపడి నిన్నరాత్రి ఆ ఉత్తరమివ్వలేదు. అదికాదు మామయ్యా - వారి నొకసారి రమ్మని రాస్తే" అంది కొంచెం స్వరం తగ్గించి.

పరంధామయ్య మండిపడ్డాడు. "నీ కేమైనా మతిపోయిందా? క్రిందటిసారి రమ్మంటే వచ్చి చేసిన నిర్వాహకమేమిటి? సరిగ్గా ఆరు నెలల క్రిందటే కదూ యింట్లో ఉన్న సర్వస్వం వాడికిచ్చే సేవు! ఆఖరి దమ్మిడీ కూడా మిగల్చకుండా వాడి చేతిలో పెట్టావు? ఉద్యోగం లేనిదే ఈ యింటి గడప తొక్కనని శపథం చేశాడా! ఎన్నెన్ని ప్రమాణాలు చేశాడు! నీమీదా నామీదా ఒట్లు వేయలేదూ! అంత డబ్బూ మూడు నెలలకే తగలబెట్టి మరొక్క అయిదు వందలు పంపించుమని సిగ్గులేకుండా ఉత్తరం రాశాడా! 'ఇంక నా దగ్గరనుండి నీకు దమ్మిడీ రాదు. నా కింక ఉత్తరాలు రాయకు' అని రాసినా వాడికి బుద్ధి రాలేదన్నమాట. మళ్ళీ డబ్బు కావాలనేనా రాశాడు?" ప్రశ్నార్థకంగా సరస్వతివైపు చూశాడు పరంధామయ్య.

"అనుకుంటా. ఇంగ్లీషున రాశారు. ఇదిగో చూడు" అని చేతికందించ్చింది.

"వా డేం రాస్తాడో నాకు తెలియదూ - వట్టి దరిద్రుడు - నాకు చెడబుట్టాడు—" అనుకుంటూ వణుకుతున్న చేతులలో కార్డునొకసారి దగ్గరగా పెట్టి మళ్ళీ దూరంగా పెట్టి దృష్టినానించి చూశాడు పరధామయ్య. అతడు కోపంతో వణికిపోతున్నాడు. చూసీ చూడగానే సన్నని యింగ్లీషు అక్షరాలతో వ్రాసిన ఆ పోస్టు కార్డులో స్ఫుటంగా రు. 1000. అన్న అంకె మాత్రం కన్పించింది. కోపానికి శరీరం తట్టుకో లేని ఉద్వేగంలో ఉన్నాడతడు. వెయ్యిరూపాయలు అన్న అంకెలు భూతాల్లాగ అతని కళ్ల ముందర వికట్టాట్టహాసం చేశాయి.

"వెయ్యి రూపాయిలట - వెయ్యి రూపాయిలు. పట్టుకెళ్ళిన వెయ్యి రూపాయిల కింత పెద్ద ఉద్యోగం సంపాదించి నన్నూ నిన్నూ ఉద్ధరించాడు. ఇంకా మరొకసారి ఉద్ధరిస్తాడు."

"పోనీ వారిని రమ్మని ఒక ఉత్తరం రాసి చూడు మామయ్యా."

"ఈ దరిద్రుడికి ఉత్తరం వ్రాయమని నీ సలహా కూడానా" అంటూ సరస్వతివైపు చుర చురా చూస్తూ చేతిలోని కార్డును నలిపి విసరి కొట్టాడు.

నలిగిన కార్డును భద్రంగా తీసి గూటిలోపెట్టి అక్కడ ఉండలేక వెళ్ళిపోయింది సరస్వతి.

వీధిలోకి వెళ్లాలనుకున్న పరంధామయ్యకు ఈ ఉత్తరంతో నవనాడులూ క్రుంగిపోయాయి. కొడుకు చేసే అకృత్యాలకు కోపం, దుఃఖం ముంచుకొచ్చాయి. అలాగే నడవలో నగం తాళ్లు తెగిన నులకమంచంమీద కూలబడ్డాడు. వార్ధక్యం చేత మనస్సులో ఉద్వేగానికి శరీరం తట్టుకోలేక ఆయాసపడుతున్నాడు.

"అది బ్రతికే ఉంటే వీడిలా తయారయే వాడా" అనుకుని తల రెండు చేతులతో పట్టుకొని వలవలా ఏడ్చేశాడు.

తల్లిలేని పిల్లవాడు కదా అని గారాబంగా పెంచాడు. తనకున్న దానిలోనే లేమి కనిపించకుండా ఒక్కగా నొక్క కొడుకును పెంచి పెద్దవాడిని చేశాడు. బి. ఎస్. సి. దాకా చదువు చెప్పించాడు. ఇక డిగ్రీ చేత వుంది, ఏదో ఉద్యోగం చేసుకుని సంసార ధర్మం నెరవేర్చలేకపోడు అని గర్వపడ్డాడు. కాని ఇంతలా చెడిపోతాడనుకోలేదు.

శేషాద్రి చదువుకున్నన్నాళ్లు బుద్ధిగానే చదివాడు. ఏ తరగతిలోనూ ఫేలవలేదు. చదువు పూర్తయినాక మాత్రం ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నానంటూ ఆరునెలలు కాళీగా తిరిగాడు.

ఇంతలో ఏ చెడుసావాసా లొచ్చాయోకాని మనిషి పూర్తిగా పాడైపోయాడు. ఇంటికి వచ్చినపుడల్లా తండ్రిని వేధించి చేతిలో ఉన్నంత డబ్బూ తీసికుని ఊళ్లంట పోవటం. అంతా ఖర్చుచేసి తిరిగివచ్చి 'ఇప్పడు బుద్ధి వచ్చింది యింకజాగ్రత్తగాఉంటా'నని శపథాలుచేయడం. శేషాద్రి బి. యస్. సి పాసయి మూడుసంవత్సరాలు దాటింది. నిజానికి అతడు పాసయిన నాటికీ యింటి పరిస్థితు లిప్పడున్నంత అధ్వాన్నంగా లేవు. అప్పటికి పరంధామయ్య కష్టపడి సంపాదించినది కొంత, ప్రావిడెంటుఫండు కొంత, అంతాకలిసి దగ్గరగా మూడువేల రూపాయిలు వడ్డీమీద తిరుగుతూం డేది. పొదుపయిన సంసారం. చిన్న కుటుంబం అవటంచేత కష్టం లేకుండానే గడిచిపోయేది.

మొదటిసారి శేషాద్రి ఏదో ఉద్యోగం ఖాళీ వచ్చిందని దానికి 500 రూలు డిపాజిట్టు కట్టాలని తండ్రిని నమ్మించి డబ్బు తీసికెళ్ళాడు. నెల్లాళ్లలో తిరిగివచ్చి ఆ డబ్బు నెవరో కొట్టేశారని ఏవో కథలల్లి మళ్లీ మరికొంత డబ్బు తీసికెళ్లాడు. అప్పడదంతా నిజమేననుకుని నమ్మాడు పరంధామయ్య. కాని మరొకసారి అదే పద్ధతి అవలంబించేసరికి కొడుకు పోకడలను కనిపెట్టేడు. దగ్గర కూర్చోబెట్టుకునిగంటల తరబడి బోధపరిచాడు కూడా!

"నిన్ను నమ్ముకున్న యిల్లాలు గతేమికానురా! నేనా కాటికి కాళ్ళుచాచుకునిఉన్నాను. నేను గుటుక్కుమంటే నువ్విలా నీ యిష్టం వచ్చినట్టు తిరుగుతూంటే దాని గతేంకాను— ఇందుకటరా నీకు కోరి పిల్లనిచ్చింది మీ అత్త. అన్న కొడుకువు కదా-అభిమానంగా చూనుకుంటావని కదూ నీ కిచ్చింది. లేకపోతే నిన్ను మించిన సంబంధం రాకపోతుందా దానికి" అన్నాడు.

శేషాద్రి తండ్రి దగ్గర ఎప్పడూ అతి వినయంగానే ఉంటాడు. సరస్వతి నెప్పడూపల్లెత్తు మాట అనడు. దేనికీ కాదనడు. అన్నిటికీ 'ఊ' కొడతాడు.

"నావల్ల పొరపాటయింది నాన్నా. ఇకమీద జాగ్రత్తగా ఉంటాను. నేనింక మిమ్మల్ని కష్టపెట్టను" అని సులభంగానే చెప్పేసాడు. కాని గడపదాటితే అతని బుద్ధికి నిలకడలేదు. అతని చుట్టూ కొన్ని దుష్టశక్తు లున్నాయి. ఏ క్షణంలోనైనా అతనికి కాస్త సద్బుద్ధి పుట్టినా వాళ్ళా బుద్ధిని నిలువనీయిరు.

ఆఖరుసారిగా శేషాద్రి ఆరునెలల క్రిందట వచ్చాడు. తండ్రి కాళ్ళమీద పడి బ్రతిమాలాడు. సరస్వతి చిబుకం పట్టుకుని లాలనగా అడిగాడు. తనకొక వెయ్యి రూపాయిలిస్తే అది పట్టుకుని ఎక్కడికి వెళ్ళయినా ఎలాగయినా ఉద్యోగం సంపాదించి తనను తీసుకువెళ్లి పోషిస్తానని.

"నువు ఉద్యోగం చేయటం దానిని పోషించటం రెండూ ఒక్కసారే-ఈ వెయ్యి రూపాయలూ రేపు సాయంత్రంలోగా పేకాటలో చెల్లిపోవూ" అని తండ్రి దెప్పి పొడిచాడు. అలా కాదు - ఈసారి మాత్రం తన మాట నమ్మమన్నాడు - ఉద్యోగం లేకుండా ఈ గడప తొక్కనన్నాడు.

ఆఖరికి అనుమానిస్తూనే పరంధామయ్య తన దగ్గర ప్రోవిడెంటు ఫండు తాలూకు మిగిలిన 500 రూపాయలు ఇచ్చేశాడు. సరస్వతి తన వంటిమీద ఉన్న బంగారమంతా మిగతా 500 రూపాయల కిమ్మత్తు చేస్తుంది అమ్మి సొమ్ము చేసుకోమని యిచ్చేసింది.

అసలు పరంధామయ్య అప్పడు కూడా ఇవ్వకపోను-కాని సరస్వతే పోరు పెట్టింది. ఈ మారాయన బుద్ధిమారింది, ఈ ఒక్కసారికీ మన్నించి ఇవ్వమని-పరంధామయ్య సరస్వతి మాట కాదనలేకపోయాడు. ఆమె కన్నకూతురు కంటె ఎక్కువ తనకి.

కొడుకుమీద ఎంత నమ్మకం లేకండాపోయినా ఇంకా అతని లోతుగుండెలో ఏ మూలో ఏనాటికైనా శేషాద్రి "నాన్నా నాకు ఉద్యోగమైనది, అని తిరిగి రాకపోతాడా" అని, ఎప్పటికైనా సరస్వతి పుణ్యం పండకపోతుందా అని ఒక ఆశ బాధిస్తూనే ఉంది. కాని నిన్నటి ఉత్తరంతో అతనికున్న కాస్త కొనఊపిరి పోయినట్లయింది. ఉన్న కాస్త గ్రుడ్డివెల్తురూ లేకండా పోయినట్లయింది.

"ఇంక వీడు బాగుపడేది లేదు. నాకే ముందింక ఏదో ఒకలాంటి చావు చచ్చిపో తాను - సరస్వతి బ్రతుకెలా వెళ్తుంది!" అని విలవిల లాడిపోయాడు.

పరంధామయ్యకు ఆ నాటి రాత్రి తెల్లవార్లూ కునుకుపట్టలేదు. తాను చెమటోడ్చి దమ్మిడీ దమ్మిడీ కూడబెట్టి సంపాదించిన డబ్బంతా కొడుకు జేబు ఖర్చుల కయిపోయింది.

ఇలాంటి కొడుకు బ్రతికున్నా ఒకటే చచ్చి పోయినా ఒకటే అనుకున్నాడు పట్టలేని కోపంలో - ఇంతలో సరస్వతి ముఖం దీనంగా అతని కళ్ళముందు కన్పించింది. సరస్వతి భవిష్యత్తు తల్చుకుని ముసలాయన కంటికి ధారగా ఏడ్చాడు - రాత్రంతా.

"తల్లి అయినా తండ్రి అయినా నువ్వే అన్నయ్యా" అంటూ సరస్వతిని తన కప్పగించింది వాళ్ళ చెల్లెలు పార్వతమ్మ....

• • •

కాకులు కావు కావు మంటున్నాయి.

సరస్వతి వీధి వాకిలి తుడిచి కళ్ళాపు జల్లు తూంది. గతరాత్రి నిద్రా భోజనములేక అలసి పోయిన పరంధామయ్యకు అలవోకగా చిన్న మగత నిద్ర పట్టింది....

శేషాద్రి పెద్ద ట్రంకు పెట్టె ఒక హోల్డాలు పట్టుకుని చిన్న టాక్సీలోవచ్చాడు. ఖరీదయిన సూటు - అందమన టై - చక్కగా క్రాపు దువ్వుకుని-"నా బాబు ఎప్పుడైనా దొరలాఉంటాడా" అని పరంధామయ్య శేషాద్రి చిన్నతనంలో అతనిని గురించి ముచ్చటగా ఊహించుకున్న రూపమే అది సరిగ్గా - వస్తూనే తండ్రి పాదాలకు నమస్కారం చేశాడు. "నా కుద్యోగమయింది. నాన్నా నెలకు వెయ్యి రూపాయలు జీతం - ఇవిగో నీ కోసం తెచ్చా నివన్నీ" అంటూ పెట్టె తెరచాడు - ట్రంకు పెట్టెలో ఒకప్రక్క కొత్త పంచలు . మరొక ప్రక్క అన్నీ వెయ్యి రూపాయిల కట్టలు - ఎంత తీసినా తరగని కట్టలు.

పరంధామయ్య వళ్ళు పరవశమైపోయింది. మహదానందంతో "సరస్వతీ—సరస్వతీ— వెయ్యిరూపాయిలు—ఎన్నివేలో వెయ్యిరూపాయలే-ఇవన్నీ వెయ్యిరూపాయల—"

పరంధామయ్య కళ్ళు విప్పేసరికి ఎదురుగా శేషాద్రి సరస్వతీ నుంచుని ఉన్నారు. సరస్వతి నవ్వుతూ "ఏమిటి మామయ్యా కలగన్నావా? అన్ని వేలెక్కడివీ-ఒక్క వెయ్యేగా" అన్నది భర్తవైపు ఓరగాచూస్తూ.

పరంధామయ్య కంతా అయోమయంగా ఉంది. తానెక్కడ ఉన్నాడో ఏమి చూస్తు న్నాడో అంతా సందిగ్ధంగా ఉంది. ఒక్కసారి కళ్లు నులుముకొని "ఏమిటమ్మా సరస్వతీ— ఏమిటిదంతా" అన్నాడు ఒక వెర్రిచూపుచూసి.

"ఏమీలేదు మామయ్యా - కంగారుపడకు— మీ అబ్బాయి వచ్చేరిదిగో—ఆయన రాసిన ఉత్తరం నువ్వు సరిగా చదువలేదు మామయ్యా- అనవసరంగా బాధపడ్డావు-" అన్నది.

పరంధామయ్యకు వర్తమానం కొంచెం కొంచెం అర్థమౌతూంది. ఇంతవరకూ తాను నిద్రలో ఏదో కలగన్నాడనీ యిప్పుడు తాను చూసేది నిజమేనని- కళ్ళు పెద్దది చేసికొని శేషాద్రి వైపు మరింత దీక్షగా చూశాడు. శేషాద్రి నిజంగానే మంచి సూటు టై వేసుకున్నాడు. అతడేదో తన్మయం చెందినట్లయి "శేషూ బాగున్నావురా ఇలారా" అన్నాడు. శేషాద్రి తండ్రి ప్రక్కనే మంచందండిపై కూర్చున్నాడు.

"ఉద్యోగమయిందా శేషూ" అన్నాడు- అంతవరకూ పడిన హృద్వేగంవలన నీరసపడిన గొంతుతో—

"ఉత్తరం చదవలేదూ నాన్నా" అన్నాడు శేషాద్రి. సరస్వతి మాట్లాడకుండా గూటిలో తాను భద్రపరచిన నిన్నటి కార్డు తెచ్చిచ్చింది.

పరంధామయ్య తానేదో తెలివితక్కువలో పడ్డానని అర్థం చేసుకుంటూ ఉత్తరాన్ని మొదటినుండీ చదివాడు.

"ఉద్యోగం కోసం పట్టుకొచ్చిన వెయ్యి రూపాయిలూ మీరన్నట్లు తెచ్చిన కొద్దిరోజుల లోనే పేకాటలో పోగొట్టుకున్నాను. పేకాటమీద మమత వదలలేకే మళ్ళీ డబ్బు పంపించమని మీకు రాశాను. మీరు పంపించపోతే స్నేహితుల దగ్గర అప్పచేసి ఆడటం మొదలు పెట్టాను—పోయిన కొలదీ మరింత పట్టుదల హెచ్చింది.

నా అదృష్టం పండి పోయిన డబ్బంతా తిరిగి వచ్చేసింది. మీరిచ్చిన 1000 రూపాయలు తిరిగి యింటికి తీసుకువస్తున్నా- ఎల్లుండి ఉదయానికి ఇల్లు చేరుకుంటాను!'' అని వ్రాశాడు.

పరంధామయ్య లోతుకళ్ళలో ఆనందం తొణికిసలాడింది.

''పొరపాటు పడ్డానురా! 1000 రూపాయలు 'అన్న అంకె చూడగానే నా ఆలోచనంతా, నువ్వు మళ్లీ డబ్బుపంపించమన్నావనే వెళ్లింది, ఆ కోపంలో వివరంగా చదవనేలేదు.''

''అందులో మీ పొరపాటేముందిలెండి — నేనింతవరకూ మీకెప్పుడు జాబు వ్రాసినా డబ్బు కావలనేకదూ.''

పరంధామయ్యకు తన కల గుర్తుకొచ్చి నవ్వొచ్చింది. ''నాకేమని కల వచ్చిందనుకున్నావు'' అని జరిగినదంతా చెప్పాడు.

''నిజంగానే ఉద్యోగం కూడా సంపాదించాను నాన్నా—కాని జీతంమాత్రం వెయ్యి రూపాయిలు కాదు. నూరు రూపాయలే'' అన్నాడు శేషాద్రి తృప్తిగా చిరునవ్వు నవ్వి.

''ఒక్క సున్నేకదూ తక్కువ'' అంది. సరస్వతి లోపలికెప్పుడు వెళ్ళిందో భర్త తెచ్చిన క్రొత్తచీర కట్టుకుని మహలక్ష్మిలావచ్చి మామయ్యకు నమస్కరించింది. ''ఈ రోజు సుదినం తల్లీ-తెల్లవారేసరికి నీ సౌభాగ్యానికి కొత్త కళలొచ్చాయి-'' అన్నాడు పరంధామయ్య—ఆనందంతో చెమ్మగిల్లిన కళ్ళు వత్తుకుంటూ.

''మళ్లీ పేకాటలాడవద్దని చెప్పమామయ్యా'' అన్నది సరస్వతి భర్త వైపొక కొంటెచూపు చూసి-

''ఇంకా ఆడేటట్లయితే యిక్కడిదాకా ఎలా వస్తానూ-అసలొకనాడు స్నేహితుల బలవంతంమీద ఆడాను. చేతిలో డబ్బంతా ఒక గంటలో పోయింది. పోయిన డబ్బు తిరిగి వచ్చేదాకా ఆడి మరి పేక ముట్టుకోకూడదనుకున్నాను. ఆ పంతమే యింతవరకూ తెచ్చింది. ఏమయితేనేం—నాకల నిజమయింది. నా డబ్బు నాకు వచ్చింది'' అన్నాడు గర్వంగా సరస్వతి వైపు చూసి.

''నా కలకూడా నిజమయిందిరా—శేషూ! నీకుద్యోగం వచ్చింది-ఇంకేం కావాలి నాకు.''

''ఎక్కడ మామయ్యా వెయ్యిరూపాయిల జీతం కాదుగా.'' అన్నది సరస్వతి బుంగమూతి పెట్టి.

''ఒక్క సున్నేగా తక్కువ'' అన్నాడు శేషాద్రి.

చాలా కాలానికాయింట్లో నవ్వులు ప్రతిధ్వనించాయి. ★

---

(24వ పేజీ తరువాయి)

కొద్దిపాటి మేకప్‌తో, చీరె అందంగా కట్టి పద్మ, "రెడీ, సార్!" అని వచ్చినప్పుడు గోపాలం ఆమెను మొదటిసారి చూసినట్టుగా ఫీలయినాడు. అనుకోవటాలుకాదు, పద్మ నిజంగానే ఉంది!

లేక తన కళ్ళు మారుతున్నాయా?

రిహార్సల్ జరగవలిసిన విధంగా జరగలేదు. ప్రొడ్యూసరు పద్మకు ఎదురుగా వచ్చి కూచుని ముతక హాస్యం చాలాచేశాడు. సత్యం ఆ హాస్యం అర్థంకాని మొహంపెట్టి, ''రిహార్సల్, రిహార్సల్! తరవాత ఎవరి స్పీచ్?'' అంటూ బండి తోలుతూ వచ్చాడు. మగస్టార్ ప్రొడ్యూసరు హాస్యానికల్లా నవ్వినట్టు అభినయిస్తూ, డైరెక్టరుగారు బండి తోలినప్పుడల్లా సీరియస్ మొహం పెడుతూ వచ్చాడు.

అన్నా చెల్లెలు సంభాషణ సీను. డైరెక్టరుగారు హీరో సంభాషణలను ఏమీ సరిదిద్దలేదు. అవి నిర్దుష్టంగా ఉన్నాయనికాదు, రిహార్సల్‌లో దిద్దనవసరంలేదు కనక. కాని పద్మ డయలాగ్ చాలాచోట్ల సరిచేశాడు. పద్మ నిరుత్సాహ పడుతున్నదని గోపాలం గ్రహించి ఏమీ చెయ్యలేక పోయాడు. సత్యంగారు మరి పద్మస్థితి కనిపెట్టే అన్నాడో, లాంఛనగానే అన్నాడోగాని, రిహార్సల్ అయినాక, ''ఏమ్మా? బాగా చెప్పావు. సెట్‌మీద ఇంకా పెర్ఫెక్ట్‌గా వస్తుంది. డోంట్ వర్రీ!'' అన్నాడు.

పద్మతోసహా గోపాలం బయటికి వచ్చేసరికి నరసింహులు ఎదురయాడు.